క్లుప్తంగా

పాన్‌షాప్ దగ్ధం



దగ్ధమైన పాన్‌షాప్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని 16వ వార్డు ఈదులగూడలో జన్నపాల వెంకయ్య కు చెందిన పాన్‌డబ్బా శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని కాలిపోయిన పాన్‌షాప్‌ను పరిశీలించారు. బాధితుడిని అన్ని విధాలా ఆదుకోవాలని అధికారులను కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట వార్డు ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు నందకిషోర్ యాదవ్, కిరణ్ తదితరులున్నారు.

బొడ్డుపల్లి శేఖర్‌కు నివాళి



బొడ్డుపల్లి శేఖర్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, ప్రజా సమస్యలపై బొడ్డుపల్లి శేఖర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సురిగి వినయ్, బొడ్డుపల్లి అర్జున్, షేక్ శంషొద్దీన్, శివ, శైలజ, శ్రీకాంత్, సిద్ధార్థ్, ఆంజనేయులు, భాను, ఆంజనేయులు, మధు, నవీన్, అనూష, అఖిల, పూజ, అంజలి పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ




డైరీ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ డైరీని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జింకల సత్యనారాయణ, నేరెడుగొమ్మ ఏడుకొండలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దొడ్డి నర్సింహ, సంపత్, రాజ్యలక్ష్మి, సుధీర్, గోపాల్, స్వరూపా రాణి, శేఖర్‌రెడ్డి, రుక్మిణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

త్రిపురారం: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిద్ధాంతి కృష్ణ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు శుక్రవారం తెలిపారు. కాగా.. ఆయన నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడం తోపాటు, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తిరిగి బీజేపీలో చేరనున్నట్లు సమాచారం.

బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న హన్యనాయక్

మిర్యాలగూడ అర్బన్: హౌజ్ ఆఫ్ ప్రేయర్స్ విశ్వాస పరిచర్య ప్రార్థన బృందం ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని టాకారోడ్డులో పేద సిక్కులకు నిత్యావసర వస్తువులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ హన్యనాయక్, రమాయాబాయి, అర్జున్‌సింగ్, అవతార్‌సింగ్, రేణుక, లక్ష్మి తదితరులున్నారు.

యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా అంబేద్కర్



నియామకపత్రం అందజేస్తున్న బాలునాయక్

కొండమల్లేపల్లి: దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా యేకుల అంబేద్కర్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ నియామక పత్రం అందజేశారు.

ఎండుతున్న పెద్దవాగు

- వర్షాలు లేక వాగులు, వంకలు పారకపోవడంతో అడుగంటుతున్న జలాలు
- ఆందోళనలో పెద్దవూర మండల రైతులు

పెద్దవూర: పెద్దవూర మండలంలో ఎప్పుడూ నీటితో కళకళలాడే పెద్దవాగులో నీరు అడుగంటుతుంది. దీంతో వాగు పరిధిలో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాలుగైదు పర్యాయాలు తప్ప ఏనాడు వాగు ఎండిపోయిన దాఖలాలు లేవు. వేసవిలోనూ వాగులో నీరు పారుతుంది. గత ఐదారు సంవత్సరాల నుంచి ఆగస్టులో ఎండిపోతుంది. ఈ యేడాది జనవరిలోనే నీరు లేకుండా పోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వాగులు, వంకలు పారకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. వరదలు రాకపోవడంతో నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజీలోనే ఉంది.

వందల ఎకరాల్లో సాగు..

మండలం గుండా ప్రవహించే పెద్దవాగు నాంపల్లి మండలం పసునూరు చెరువు వద్ద పుట్టి గుర్రంపోడ్, పీఏపల్లి మండలాల మీదుగా పెద్దవూర మండలంలోనికి ప్రవహిస్తుంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నిర్మాణం కాకముందు వర్షాకాలంలోనే ఈ వాగులో నీరు ప్రవహించేది. ప్రాజెక్టు నిర్మాణంతో కాలువల ద్వారా ఎప్పటికప్పుడు చెరువులను నింపుతుండటం, జంటనగరాలకు కృష్ణాజలాలను అందించే వాటర్ ప్లాంట్‌ను పదిహేను రోజుల కొకసారి కడుగుతుండడంతో నిత్యం నీళ్లు ప్రవహిస్తుంటాయి. దీంతో వాగు సమీపంలో భూములు ఉన్న రైతులు వాగులో విద్యుత్ మోటార్లు వేసుకుని పైపులైన్ ద్వారా పంటలు, తోటలు సాగుచేసుకుంటున్నారు. పెద్దవూర, ఈదులగూడెం, పిన్నవూర, బట్టుగూడెం, కొత్తగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి, పెద్దగూడెం, చిన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు వాగు వెంట



పెద్దవూర సమీపంలో ఎండిపోయిన పెద్దవాగు

వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేశారు. అదేవిధంగా వాగుకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంద ఎకరాల భూములకు పైపులైన్లు వేసుకుని బత్తాయి తోటలను, పత్తి, మిరప పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో వరినాట్లు వేయడంతో విద్యుత్ మోటార్లు అన్నింటిని ఆన్ చేయడంతో వాగులో నీరు అయిపోతుంది. పై నుంచి నీరు రాకపోవడంతో రైతులంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎమ్మార్పీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని మండల రైతులు కోరుతున్నారు.



వాగులో నీరు లేకపోవడంతో మోటారు వద్దకు గుంతను తీసుకుంటున్న రైతులు

వాగును నమ్ముకుని సాగుచేస్తున్నాం



వాగులో నిత్యం నీళ్లు పారుతుండడంతో వాగును నమ్ముకుని రూ.8లక్షలు ఖర్చు చేసి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ పొలానికి పైపులైన్లు వేసుకున్నాను. ఇరవై ఎకరాల్లో మిరప పంట వేశా. సరైన వర్షాలు లేక వాగులో నీళ్లు పారలేదు. చెరువులు సైతం ఎండిపోయాయి. పదిహేను రోజులకు ఒకసారి వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయగా వృథానీరు వస్తాయి. ఈ నీటితోనే ఇన్ని రోజులు నెట్టుకొస్తున్నాం. వాగు వెంట మోటార్లు ఎక్కువ సంఖ్యలో వేయటంతో వాగు ఎగువ భాగంలో ఉన్న రైతులకు ఆ నీళ్లు సరిపోతలేవు.

– కత్తి ప్రభాకర్‌రెడ్డి, రైతు బట్టుగూడెం

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

మిర్యాలగూడ అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచాలని కోరారు. మహిళల పట్ల జరుగుతున్న హింస, దాడులు, అత్యాచారాలు, వివక్షతకు వ్యతిరేకంగా ఏఐఎఫ్‌డబ్ల్యూ పోరాటం చేస్తుందన్నారు. మహిళలకు చట్టసభల్లో పురుషులతో సమానంగా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, జ్యోతి, సుకన్య, రమణ, మౌనిక, అమని, యాదమ్మ, లింగమ్మ, కరుణ, యల్లమ్మ, చంద్రమ్మ, అనసూర్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ

స్పెషల్ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

డిండి: రానున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టి ఉంచుకుని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌లలో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.తిర్పతయ్య ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌పై బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు నమోదు, సవరణలు చేసుకునేందుకు మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయం వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ.శ్యామ్ నాయక్, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ తిర్పతయ్య

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు

కొండమల్లేపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ పట్టణంలోని స్వరాజ్ మైదానంలో శుక్రవారం 206 అడుగుల బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి కొండమల్లేపల్లి నుంచి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గాజుల పున్నమ్మతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు నాగటి జోసఫ్, నాయకులు యేకుల సురేష్, మేడ సైదులు, భూతం సైదులు తదితరులు వెళ్లారు.

కొత్తపేటతండాలో పశువైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని కొత్తపేటతండా గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి స్వప్న మాట్లాడుతూ వైద్య శిబిరంలో 46 గేదెలకు గర్భకోశ సమస్యలు ఉన్నట్లు గుర్తించి నివారణ వైద్యం అందించినట్లు తెలిపారు. 24 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డీఎల్‌డీఏ ఈఓ పాశం శ్రీనివాస్‌రెడ్డి పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనావత్ శాంతిప్రకాశ్, ఉపసర్పంచ్ ధనావత్ జ్యోతినాగు, సూపర్‌వైజర్ ఎం.శివారెడ్డి, సిబ్బంది డి.సైదులు, గోపాలమిత్రలు బాలాజీ, ప్రభాకర్, భిక్షానాయక్, అశోక్, పాడి రైతులు ఉన్నారు.

క్రీడా పోటీలు ఐకమత్యాన్ని పెంచుతాయి

గుర్రంపోడు: గ్రామీణ ప్రాంత క్రీడలు యువతలో ఐకమత్యాన్ని పెంచుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెల్లపూరి కరుణాకర్‌రావు అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని నడికూడ గ్రామ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీలు దేహదారుఢ్యం, చురుకుదనాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహ్మద్ సత్తార్, ఉపసర్పంచ్ మాదనబోయిన కేశవులు, కాంగ్రెస్ మహిళా నాయకురాలు నాగమణి, నాయకులు టంగుటూరి సురేష్, మహ్మద్ ఖలీల్, వెలగపూడి రాంబాబు, తరి శివ, నిర్వాహకులు సాయికుమార్, దాసరి సైదులు, నాగిరెడ్డి, జానీ, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న కరుణాకర్‌రావు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పాల్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న తరి రాము

గుర్రంపోడు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని పాల్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షలపై సూచనలు ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక క్లాసులు సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. సమావేశంలో అయిటిపాముల యాదగిరి, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డిపై అవిశ్వాసం



జిల్లా సహకార సంఘం అధికారికి అవిశ్వాస తీర్మాన పత్రం అందజేస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్లు

పెద్దఅడిశర్లపల్లి: పెద్దఅడిశర్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఎల్గూరి వల్లపురెడ్డిపై అవిశ్వాసాన్ని కోరుతూ 10 మంది డైరెక్టర్లు జిల్లా సహకార సంఘం అధికారి కిరణకుమార్‌కు శుక్రవారం తీర్మాన పత్రాన్ని అందజేశారు. పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా తేర మణిపాల్‌రెడ్డి, అచ్చుత్‌కుమార్, రమేష్‌నాయక్, శైలజ, ఆంజనేయులు, జానిమియా, నారాయణ, రామకృష్ణ, సీతారాంనాయక్‌లు ఈ తీర్మాన పత్రంపై సంతకాలు చేశారు.

దుప్పట్ల పంపిణీ

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని సాయిబాబా దేవాలయం వద్ద భిక్షాటన చేస్తున్న వారికి, పేదలకు లయన్స్ క్లబ్ మిత్ర ఆధ్వర్యంలో జీఎస్‌టీ జిల్లా కోఆర్డినేటర్ దశరథ ఆర్థిక సహకారంతో శుక్రవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. వారిలో లయన్స్ క్లబ్ మిత్ర అధ్యక్ష, కార్యదర్శులు అంకం చంద్రమౌళి, కూరెల్లి కృష్ణాచారి, మాకం మహేశ్, ఏలే యాదయ్య, చేరిపల్లి జయలక్ష్మి, మొర అశోక్, చిలువేరు శ్రీనివాసులు, పగిడిమర్రి రఘురాములు తదితరులు ఉన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

స్నేహభావానికి క్రీడలు దోహదం



గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, స్నేహభావానికి ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని గొర్ల రాంబాబు మెమోరియల్ కప్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం గూడూరు గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అనంతరం మొదటి బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ.15,016, తృతీయ బహుమతి 10,016 అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బొడ్డు సాయికుమార్, కట్టబోయిన సంతోష్, బైరెడ్డి అనిల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కట్టబోయిన రామలింగయ్యయాదవ్, గాయం ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ నూక విక్టోరియా, శ్రీనివాస్, అర్జున్, వెంకటరమణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వేత్తలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో పట్టణంలోని వర్షిత ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నాటి రమేష్, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రాంబాబు, కోల సైదులు, లింగయ్య, బాబురావు, మాశెట్టి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంధం ఎత్తుకున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ: బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందితే పల్నాడు జిల్లా దాచేపల్లి మండల పరిధిలోని తక్కెళ్లపాడులో ఉన్న సయ్యద్ వలీ జానివలీ దర్గా ఉర్సుకు గంధాన్ని ఎమ్మెల్యే ద్వారా తీసుకొస్తానని మిర్యాలగూడ పట్టణానికి చెందిన ముజావర్ గౌస్ మొక్కుకున్నాడు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గంధం ఎత్తుకోగా గౌస్ ఉర్సు ఉత్సవాలకు గంధాన్ని తీసుకెళ్లాడు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాని, గౌస్, బల్గూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలపై అవగాహన

కొండమల్లేపల్లి: యోగి వేమన జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గౌతమి స్కూల్, రెయిన్ బో, కృష్ణవేణి, సాయి సిద్ధార్థ, బధిర పాఠశాలల్లో విద్యార్థులకు వేమన పద్యాలపై అవగాహన కల్పించారు. త్రైత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పగిడిమర్రి వెంకటేశం, చంద్రమౌళి, చక్రధర్, నరసింహ, పరమేష్, శ్రీను, జంగయ్య, కవిత, శ్వేత పాల్గొన్నారు.

22న ప్రత్యేక పూజలు

కొండమల్లేపల్లి: అయోధ్యలో శ్రీసీతారాముల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఈనెల 22న కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రమౌళీశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయిని మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదుకు అవకాశం

కొండమల్లేపల్లి: ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్‌ను ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలింగ్‌బూత్‌ల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు ఆవులు మృతి

గుర్రంపోడు : మండలంలోని మొసంగి గ్రామంలో శుక్రవారం నిరసమెట్ల సంతోష్ అనే రైతుకు చెందిన రెండు ఆవులు సమీప రైతు తోటలో గడ్డిమందు పిచికారీ చేసిన పచ్చిగడ్డిని మేయడంతో అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ చౌకధరల దుకాణం – 32ను శుక్రవారం డీటీసీఎస్ ఎండీ అయూబ్ తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణ నిర్వాహకులు సమయపాలన పాటిస్తూ బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఎవరి పేరిట రేషన్ దుకాణాలు ఉంటే వారే నిర్వహించాలన్నారు. అనంతరం రేషన్ లబ్ధిదారులతో మాట్లాడారు.



చింతపల్లిలో రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారి

దళిత బంధు గ్రౌండింగ్ చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

నల్లగొండ టూటౌన్: గత ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపిక చేసినవారికి దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శాలిగౌరారం మండలానికి చెందిన 270 మందితో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో ఎంపిక చేసినవారికి దళిత బంధు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రమేష్, ఏర్పుల నరేందర్, నవీన్, శంకర్, మామిడి యాకుబ్, అద్దంకి రవీందర్, గణేష్, మాచర్ల వెంకట్, కిరణ్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): ఫిబ్రవరి 3న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర బాధ్యుడు ఇందూరు సాగర్, జిల్లా కార్యదర్శి పోలె పవన్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నల్లగొండ పట్టణ కేంద్రంలో శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగం కార్పొరేటీకరణ చేయడాన్ని అడ్డుకట్ట వేయడానికి ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు న్యూ ఢిల్లీలో అఖిల భారత నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని, 3న జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో మహాధర్నా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలె వెంకట్, బొర్రాజు రవి, ఇందూరు మధు, కామళ్ల సవిందర్, ప్రభాకర్, ఎమ్.సురేష్, జాన్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కుంటను తలపిస్తున్న మురుగు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పారాబాయిల్డ్ మిల్లు నుండి వడ్లను ఉడికించిన అనంతరం విడుదల చేసే మురుగు నీటిని మిల్లు యాజమాన్యం రోడ్డు పక్కనే వదులుతున్నారు. ఈ నీరు ఒక్కచోట చేరి కుంటను తలపిస్తోంది. ఈ రహదారి గుండా వెళ్లే వారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. మురుగుతో రోడ్లకు ఇరువైపుల ఉన్న మొక్కలు సైతం చనిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా ఇప్పటికే పలుమార్లు మిల్లు యాజమాన్యానికి సూచనలు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, త్వరలోనే మిల్లు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పారాబాయిల్డ్ రైస్ మిల్లు నుంచి విడుదలైన మురుగు



మిల్లు స్థలంలో కుంటను తలపించేలా నిలిచిన మురుగు